హైదరాబాద్ వార్త

## మేడారం ప్రసాదానికి ఆన్‌లైన్ సేవలు : ఈడి రాజశేఖర్



మేడారం జాతర ప్రసాదం ఆన్‌లైన్ బుకింగ్ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసి ఈడి రాజశేఖర్ తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 20 ప్రభాతవార్త:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు మరింత సౌకర్యం కల్పించేలా మేడారం ప్రసాదం అందజేసేందుకు ఆర్టీసీ సేవలు అందిస్తుందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సికింద్రాబాద్ జెబిఎస్‌లో ఏర్పాటు చేసిన మేడారం భక్తుల సౌకర్యార్థం ప్రసాదం పంపిణీ కోసం ఆన్‌లైన్ బుకింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడి మాట్లాడుతూ మేడారం భక్తులకు ఆన్‌లైన్, టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా ప్రసాదాన్ని బుక్ చేసుకునే వెసులు బాటు కల్పించామన్నారు. దీని వల్ల భక్తులకు సమయం ఆదా అవుతుందన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమం భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తుందని అధికారులు వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బుకింగ్ వివరాలు తెలుసుకొని భక్తులు సులబంగా సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం. శ్రీనివాస్, ఏటీఎం లాజిస్టిక్స్ మహ్మద్ బిన్ ఇషాక్‌లు పాల్గొన్నారు.

## దుర్గంచెరువు దుర్గంధంపై హైడ్రా నజర్

**-చెరువులో మురుగునీరు చేరడంపై కమిషనర్ ఆగ్రహం**
**-శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని వెల్లడి**



దుర్గంచెర్వును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** మాదాపూర్ గుట్టల్లో ఉన్న దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. దుర్గంచెరువులో గుర్రపు డెక్క వ్యాప్తి చెందడం దుర్గందంగా మారడంపట్ల మీడియా కథనాలు, స్థానికుల నుంచి హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం చెరువును పరిశీలించారు. చెరువులో సగభాగం వరకూ గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎస్‌టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వార మురుగు నీరు నేరుగా దుర్గం చెరువులోకి కలవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌టీపీలకు వెళ్లే మురుగు నీరు అధికంగా ఉండడంతో ఇటు వైపు మళ్లించాల్సి వచ్చిందని అక్కడ ఇరిగేషన్ ఇంజినీర్లు చెప్పగా అది సరికాదన్నారు. ఎస్‌టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువకు మళ్లించాలి కాని.. నేరుగా చెరువులోకి ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు ఎస్‌టీపీ ద్వారా మురుగు నీటిని సుద్ధి చేసి చెరువులోకి పంపడం.. మరో వైపు నేరుగా మురుగు నీరు వదిలేయడం ఏంటని మండిపడ్డారు.

**సమన్వయంతో పని చేయాలి..**

చెరువును అభివృద్ధి చేయడం అంటే పైపై మెరుగులు దిద్దడం కాదని దుర్గం చెరువు పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులను కమిషనర్ రంగనాథ్ ప్రశ్నించారు. చెరువులోకి మురుగు నీరు కలవడం.. గుర్రపు డెక్క వ్యాప్తి చెందడాన్ని నియంత్రించడానికి మీవైపు చేసిన ప్రయత్నాలు ఏంటని అడిగారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖ, రహేజా మైండ్‌స్పేస్, ఎస్‌టీపీల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, బాధ్యత పడకపోవడమే దుర్గం చెరువు దుర్గంధానికి కారణమని కమిషనర్ తెలిపారు. చుట్టుపక్కల మురుగు నీరంతా ఎస్‌టీపీ లైన్లోకి వెళ్లేలా జాగ్రత్త పడాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల వద్ద మురుగు నీరు శుభ్రం అయిన తర్వాత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకోసం పీసీబీకి పంపాలని అధికారులను ఆదేశించారు.

**సంబంధిత శాఖల అధికారులతో సమావేశం..**

దుర్గం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం హైడ్రా కార్యాలయంలో చెరువు పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన అన్ని సంస్థలతో హైడ్రా కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువలోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైను డైవర్షన్ పనులు చేపట్టడానికి జలమండలికి ఉండే ఇబ్బందులను తొలగించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం రమేష్‌తో మాట్లాడి ట్రాఫిక్ డైవర్షన్‌కు సహకరించాలని సూచించారు. అలాగే ఇరిగేషన్, విద్యుత్, జీహెచ్ ఎంసీ, జలమండలి విభాగాధికారులతో కూడా మాట్లాడి మురుగునీరు దుర్గం చెరువులోకి చేరకుండా చేపట్టే పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఇదే సమయంలో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడి ఇన్ ఆర్బిట్ మాల్, నెక్టర్ గార్డెన్స్ ఇలా పై భాగంలోని ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి కలవకుండా చెరువుకు ఆనుకుని పడమర వైపు కాలువను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మహానగరంపై కాలుష్య కోరలు..

**-ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న వాయుకాలుష్యం**
**-వాహనాల పొగ ,రోడ్లపై దుమ్ముతోనే అధిక ముప్పు**
**-కాలుష్య నియంత్రణకు అధికారుల చర్యలు శూన్యం**
**-నివారణ ఒక్కటే మార్గమంటున్న పర్యావరణ నిపుణులు**

**హైదరాబాద్ జనవరి 20, ప్రభాతవార్త:** మహానగరం నేడు కాలుష్య కోరల్లో కొట్టుమిట్టాడుతుంది. ఒకప్పుడు నగరంపేరు చెబితే భాగ్య నగరం అనే ప్రజలు..నేడు హైదరాబాద్ అంటే అమ్మో పొల్యూషన్‌రా బాబూ అనే స్థాయికి చేరుతుంది. అని పరా వ్యవరణవేత్తలు చెబుతున్నారు. నగరంలో అభివృద్ధి పేరిట జరుగుతున్న పనులు, వాటికోసం అవసరాలకోసం వాడుతున్నయంత్రాలు, విచ్చల విడిగా నరుకుతున్న చెట్లు దీంతో కాలుష్యం నగరంపై తీవ్ర ప్రభావం చూపెడుతుంది. ఉదయం లేచినదగ్గరి నుండి రాత్రి పడుకునే వరకు ఏదో ఒకరూపంలో కాలుష్యానికి నగరవాసులు బాధితులు అవుతూనే ఉన్నారు. వాయు కాలుష్య ప్రభావంతో ప్రజలు అలర్జీ, చర్మవ్యాధులు, కొత్త జబ్బుల బారిన పడుతున్నారు. నగర ప్రజలకు ప్రమాదకరంగా మారిన కాలుష్యానికి



తగ్గించేందుకు గతంలో సుప్రీంకోర్టు ప్రభుత్వానిక జారీ చేసిన ఆదేశాలు బేఖాతరయ్యాయి. సుప్రీం ఆదేశాలు అమలు చేయడంలో ఆయా ప్రభుత్వ శాఖలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కాగా కాలుష్యనివారణకు ప్రణాళికను సిద్దం చేసిన కాలుష్య నియంత్రణ మండలి తన పని అయిపోయిందంటూ చేతులు దులుపుకుంటోంది. కాలుష్య నివారణ కోసం నివేదిక సమర్పించి ఏళ్ల గడుస్తున్నా ఆచరణలో మాత్రం ఏమాత్రం శ్రద్ద చూపడం లేదు. ఫలితంగా కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతుంది. ప్రతిఏటా గ్రేటర్ పరిధిలో సుమారు 3లక్షల వరకు కొత్త వాహనాలు రోడ ్లపైకి వస్తున్నాయి. దీంతో పాటు రహదారుల పై దుమ్మూ ధూళి పెరుగుతోంది. నగరంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఏచర్యలు తీసుకోవాలి.ఎలాంటి పనులు చేపట్టాలనే వివరాలతో కాలుష్య నియంత్రణ మండలి కార్యాచరణ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో రవాణాశాఖ కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. అయితే ఆశాఖ మాత్రం కాలుష్య నియంత్రణపై ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. వాహనాలు వినియోగం కారణంగా వెలువడుతున్న కాలుష్యంపై ఎలాంటి శ్రద్ద చూపడం లేదు. వాహనాల జీవిత కాలం 15ఏళ్ల వరకే ఉన్నా..వాటిని ఆగడువు వరకే నడిచేలా చూడాల్సిన భాధ్యత ఆర్టీఏదే. అయితే నగరంలో 15ఏళ్లు పైబడిన వాహనాలు 29వేలకు పైగానే ఉన్నాయి. ఇక నరగంలో ప్రజారవాణాలో కీలకంగా ఉన్న ఆటోరిక్షాలను డీజిల్,పెట్రోల్ నుండి ఎల్‌పీ జీ,సీఎన్‌జీకి మార్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈప్రక్రియ మొక్కుబడిగానే ఉంది. దీంతో గ్రేటర్ పరిధిలో 1.20లక్షల ఆటో రిక్షాల్లో కేవలం 30వేల ఆటోలు మాత్రమే ఎల్‌పీజీ, సీఎన్‌జీకి మారాయి. ఆటోరిక్షాల వల్ల కాలుష్య తీవ్ర త ఎక్కువగా ఉందని గుర్తించి 2000 సంవత్సరంలోనే ఆటోరిక్షా పర్మిట్లపై నిషేదం విధించారు.అయినా ఇతర జిల్లాకు చెందిన డీజిల్ ఆటోలు నగర శివార్లలోనే యథేచ్ఛగా తిరుగు తున్నాయి.

**నివారణ ఒక్కటే మార్గం...**

కొన్ని సంవత్సరాల్లో భూమిని కాలుష్యానికి వదిలేసేంతగా కాలుష్యం పెరిగిపోతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే..చెట్లను నరకడం నిలిపివేసి వాటిస్థానంలో లెక్కకు మించి కొత్తచెట్లను నాటడంతోపాటు,సంవ్సరాల తరబడి వాడుతున్న వాహనాలను వాడటం ఆపివేయాలి.కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి భూమిలోకి నీరు ఇకే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి రీసైక్లింగ్‌కి ఉపయోగంగా ఉండే ఇతరత్రా పదర్థాలను వాడకాన్ని పెంచాలని కోరుతున్నారు.

## సహజీవనానికి ఓ నిండు ప్రాణం బలి

**-జవహర్‌నగర్‌లో విషాదకర హత్యాయత్నం**
**-మధ్యలోకి వచ్చి ప్రాణాలు కోల్పోయిన తల్లి**



**జవహర్ నగర్, జనవరి 20, ప్రభాతవార్త :** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో చో టుచేసుకున్న ఓ హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తిపై కుమారుడు పెంచుకున్న కక్ష చివరకు తల్లి ప్రాణాలకే ముప్పుగా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్ విఘ్నేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న పొట్టోళ్ళ రజిని (40) ఇద్దరు కుమారు లు, కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా ఆమె జమీల్ (38) అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ వ్యవహారం ఆమె చిన్న కుమారుడైన రాజ్ కిరణ్ (24)కు ఇష్టం లేకపోవడంతో జమీల్‌పై అతనికి ద్వేషం పెరిగింది. ఇటీవల రాజ్ కిరణ్ దొంగతనాలకు పాల్పడు తున్నాడని జమీల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కోపం మరింత పెరిగింది. జమీల్‌ను ఎప్పటికైనా అంతమొందించాలని రాజ్ కిరణ్ నిర్ణయించుకుని తన స్నేహితులు కృష్ణ, సోయబ్, సోయల్, మాలిక్‌లకు విషయం చెప్పాడు. ఈ నెల 15న జమీల్‌ను ఇంటికి పిలిపించుకున్న రాజ్ కిరణ్ తన స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. ఆ సమయంలో జమీల్‌ను హత్య చేయాలనే కుట్రకు పాల్పడ్డారు. జమీల్ ఇంటికి వెళ్లేందుకు బయటకు రాగానే రాజ్ కిరణ్ గ్యాంగ్ దాడి చేసింది. జమీల్‌ను కొట్టవద్దంటూ తల్లి రజిని మధ్యలోకి వచ్చి గొడవను సద్దుమణిగే ప్రయత్నం చేసింది. అయితే ఆగ్రహంతో ఉన్న రాజ్ కిరణ్ ఇంట్లో నుంచి కత్తి తీసుకొచ్చి జమీల్‌పై విసిరాడు. దురదృష్టవశాత్తూ అది రజినీ కంటిపై తగలడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ ఈ నెల 17న రజిని మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనలో రజినీ మృతికి కారణమైన రాజ్ కిరణ్, కృష్ణను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భర్తను చంపిన గృహిణి

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 20, ప్రభాతవార్త**

జల్సాలకు అలవాటు పడిన గృహిణి వివాహేతర సంబంధం పెట్టుకొని సొంత భర్తను చున్నీతో ఊరేసి కడతేర్చిన సంఘటన కూకట్‌పల్లి పోలీ స్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్ కు చెందిన సుధీర్ రెడ్డి (44) ప్రసన్నలకు 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ప్రవేట్ ఉద్యోగం చేస్తున్న సుధీర్ రెడ్డికి భార్య ప్రసన్నల మధ్యన తరచూ గొడవలు జరిగేవని తెలియజేశారు. ఈ నేపథ్యంలో జల్సాలకు అలవాటు పడిన ప్రసన్న ఓ వ్యక్తితో వివాహేత ర సంబంధం పెట్టుకుని భర్త సుధీర్ రెడ్డి అడ్డు వస్తున్నాడనే ఆగ్రహం తో హత్య చేయడానికి పన్నాగం వేసింది. ఈ నేపథ్యంలో భర్త రాత్రిపూట నిద్రిస్తుండగా చున్నీతో సుధీర్ రెడ్డి మెడకు ఉరివేసి హత్య చేసింది. ఆపై తెలివిగా ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించడానికి ప్రయత్నించింది. అయితే సుధీర్ రెడ్డి చెల్లెలు సునీత అనుమానంతో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అసలు విషయం బయట పడింది. దీంతో భర్త సుధీర్ రెడ్డిని తానే చున్నితో ఊరి వేసి హత్య చేసినట్లు ప్రసన్న ఒప్పుకోవడంతో పోలీసులు అదుపులోకి రిమాండ్‌కు తరలించారు.

### పురానాపూల్ ఘర్షణ కేసులో పదకొండు మంది అరెస్ట్

**చార్మినార్, జనవరి 20 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ పురానా పూల్ దర్వాజ వద్ద జనవరి నెల పదిహేనువ తేదీన ప్రార్థన స్థలం విషయమై జరిగిన గొడవకు సంబంధించిన కేసులో 11 మంది నింధి తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. పాతనగరం పురానాపూల్ దర్వాజ లో ఇటీవల ఓ యువకుడు విధ్వంసం సృష్టించిన విషయం విధితమే. కాగా కొంత మంది మరో వర్గానికి చెందిన ఒక ప్రార్థన మందిరంపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ కేసులో కామాటిపుర పోలీసులు బీహార్ రాష్ట్రానికి చెందిన ఫిష్తె మహ్మద్ (23)ను అరెస్ట్ చేసిన విషయం విధితమే. పురానాపూల్ ఘర్షణకు సంబంధించి కామాటిపుర పోలీసులు 30 మందిని గుర్తించారు. కాగా ఈ కేసులో పార్థివాడకు చెందిన శంకర్ (19), అభిషేక్ (24), కులీకుషాల్ సింగ్ (19), వరుణ్ (21), అరుణ్ (20) రమణ్ (22), భూమేష్ (22), గణేష్ (19), సందీప్ (31), విశాల్ సింగ్ (22), కాళీ మంజు (45)లను అరెస్ట్ చేశామని కామాటిపుర ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు.

## పంచముఖ ఆంజనేయ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న పంచముఖ ఆంజనేయ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం ధర్మాధికారి కళావి ఎస్ జనార్దన మూర్తి

**చిక్కడపల్లి, జనవరి 20 ప్రభాతవార్త:** ఆర్టీసీ క్రాస్ రో డ్స్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీ పంచముఖ ఆంజనేయ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తులు తిలకిస్తుండగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 వ తేదీ వరకు ఈ ఉత్సవాలు ఆలయం ధర్మాధికారి కళావి ఎస్ జ నార్దన మూర్తి , సీఈఓ పి ఏ.మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్స వాలలో భాగంగా మంగళవారం విష్ణుసహస్రనామ పారాయణాలు, స్వామి వారికి అర్చన, బాలభోగం, నివేదన, మంగళ నీరాజనం, మంత్రపు ష్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, స్వామివారిని పెండ్లి కుమారుణ్ణి, అమ్మ వార్లను పెండ్లి కుమార్తెను చేయడం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతా నార్థులకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. కాగా 21 న సాయంత్రం శ్రీవార్ల రాయబారామహోత్సవమ్ ఉంటుందని, 22 న శ్రీవార్ల శాంతి కళ్యా ణం, అనంతరం శ్రీవార్ల గరుడోత్సవం ఉంటుందన్నారు. 23 న మహా సుద ర్శన హోమం, సాయంత్రం శేషవాహన సేవ, 24 న కొట్నాల వసంతోత్స వం, చక్ర స్నానం, సాయంత్రం ధ్వజ అవరోహణం, మూగబాలి, ద్వాదశ ప్రదక్షిణములు పవళింపు సేవ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### రమణీయం నవరసభరితం ఉద్భావ జాతీయ నృత్యోత్సవం



ఉద్భావ జాతీయ నృత్యోత్సవ ప్రదర్శనల్లో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జనవరి 20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సద్గురు శ్రీ శివానంద నృత్యమాల సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రెండురోజుల ఉద్భావ జాతీయ నృత్యోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా ముగిసింది. నృత్యమాల సంస్థ ప్రముఖ నాట్యగురు బొంపెల్లి సుధీర్‌రావు నేతృత్వంలో జరిగిన ఈ నృత్యోత్సవం నవరసభరితం, రమణీయంగా ఆహుతులకు కనువిందు చేసింది. ఈనాటి రెండవరోజు ఉద్భావ జాతీయ నృత్యోత్సవంలో ప్రముఖ నాట్యగురువు హరిరామమూర్తి శిష్యురాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన సన్నిధ రాజసాగి; గురువులు ఉదయ్ కాంత్, రేణుకల శిష్యురాలు బెంగళూరు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్వేత ప్రసన్న; గురువు పావని శ్రీలత శిష్యురాలు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య సుబ్రహ్మణ్యం; గురువు సి.బాలాత్రిపురసుందరి శిష్యురాలు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన వెంకట దీక్షితులు; చివరిగా కలైమామిని గురు శైలసుధ శిష్యురాలు తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శ్రీతనయ సంజనల సోలో నృత్యప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డిలు నేటి నృత్యోత్సవంలో ప్రదర్శనలిచ్చిన కళాకారులను, నిర్వాహకుడు, ప్రముఖ నాట్యగురువు బి.సుధీర్‌రావులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. సుధీర్‌రావు కళాసేవలను కొనియాడారు.

## సార్...ఆపోస్టులను కదపొద్దు..!

**-టిజిఎస్‌పిడిసిఎల్‌లో బదిలీలపై జోరుగా చర్చ**
**-రెండేళ్లు దాటిన వారికి స్థానచలనం అంటూ లీకులు**
**-కార్పొరేట్ ఆఫీస్‌కు క్యూకట్టిన యూనియన్ నేతలు**
**-తమ స్థానాలు పదిలపరుచుకునేందుకు కొందరు**
**-తమవారికి దక్కించుకునేలా మరికొందరి ప్రయత్నాలు**




**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** టిజిఎస్‌పిడిసిఎల్‌లో ఉద్యోగ బదిలీలపై జోరుగా చర్చజరుగుతుంది. రెండేళ్లుగా ఒకేస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు చేస్తారంటూ ఇటీవల హెచ్‌ఆర్ విభాగం నుంచి లీకులు వెళ్లడంతో ఇప్పటికే ఫోకల్ ( ఎక్కువ ఆదాయం )పోస్టుల్లో ఉన్న యూనియన్ నేతలు తమ పోస్టులను పదిలపరచుకునేందుకు ప్రయత్నిస్తుండగా..మరికొందరు తమ వారికి ఆయా పోస్టులను ఇప్పించేందుకు యత్నిస్తున్నారు. దీంతో గత రెండుమూడురోజులుగా మింట్‌కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద యూనియన్ నేతలతో సందడి నెలకొంది. బదిలీల ప్రక్రియ ప్రారంబమవుతుందన్న సమాచారంతో డైరెక్టర్లు, ఉన్నతాధికారులను కలుస్తూ వినతులు సమర్పిస్తున్నారు. అలాగే పలువురు యూనియన్ నాయకులు తమకు సంబంధించిన ఉద్యోగులకు తాము కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు కల్పించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో మింట్‌కాంపౌండ్‌లోని యూనియన్, అసోషియేషన్ల కార్యాలయాలు జిల్లాలనుంచి వచ్చే ఉద్యోగులు, నాయకులతో సందడిగా మారుతునా న్నయి. ముఖ్యంగా ఉద్యోగుల పనితీరుదృష్టిలో పెట్టుకుని జిల్లాల నుంచి గ్రేటర్‌కు, గ్రేటర్‌లో పనిచేస్తున్న అధికారులకు జిల్లాకు బదిలీలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. శివారుప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులపై తరుచూ ఫిర్యాదులు అందుతుండటంతో పూర్తిస్థాయిలో ఉద్యోగులను స్థానచలనం చేయాలని డిస్కం అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా నగరంలోని పలు సర్కిళ్లు, డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుపై ఉన్నతాధికారుల్లో అసంతృప్తి నెలకొంది. ప్రధాన పోస్టుల్లో ఉన్నటువంటి అసోసియేషన్ నేతలు వినియోగదారులకు అందించే సేవల కంటే తమ సొంత సమస్యలపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారని.. శాఖపరమైన పనిని పట్టించుకోవాలని పనితీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తీసుకంటామని గతంలో హెచ్చరించారు. అయినప్పటికీ కొందరిలో మార్పులేకపోవడంతో ఎలాగైనా వారికి స్థానచలనం చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తుంది.

**చర్చంతా ఫోకల్ పోస్టుల పైనే..**

సాధారణంగా ప్రభుత్వ విభాగాల్లో ఫోకల్, నాన్ ఫోకల్ అంటూ ప్రత్యేక విభాగాలు అంటూ ఏమీ ఉండవు. కానీ విద్యుత్ శాఖలో కొత్త కనెక్షన్లు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, భారీ భవన నిర్మాణాలు, సంస్థకు రెవిన్యూ ఎక్కువగా (ఆపరేషన్ విభాగం) వచ్చే ప్రాంతాలను ఫోకల్ పోస్టులుగా, నష్టాలు ఎక్కువగా ఉండే పాతబస్తీ సహా మారుమూల జిల్లాలను నాన్ ఫోకల్ పోస్టులుగా విభజించారు. గ్రేటర్ పరిధిలో 10సర్కిళ్లు, 26 డివిజన్లు ఉన్నాయి. ముఖ్యంగా ఇందులో శివారు ప్రాంతాలైన గచ్చిబౌలి, కొండాపూర్, చందానగర్, రాజేంద్రనగర్, చంపాపేట్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, హబ్సిగూడ, కూకట్‌పల్లి, సైబర్‌సిటీ, ఇబ్రహీంబాగ్, మోకిలా, శంకర్ పల్లి, కొండాపూర్, బంజారాహిల్స్, జీడిమెట్ల, శంషాబాద్, కీసర సహా శివారు ప్రాంతాల్లో సిటీకి ఆనుకుని ఉన్న చౌటుప్పల్, యాదాద్రి, షాద్‌నగర్, డివిజన్లను ఫోకల్ పోస్టులు భావిస్తారు. పాతబస్తీ సహా మారుమూల జిల్లాల్లోని డివిజన్లను నాన్ ఫోకల్‌గా విభజించారు. వీటిలో కొత్తగా అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాలు, ఐటీ అనుబంధ కంపెనీలు, పరిశ్రమలు, ఇతర పెట్టుబడి సంస్థలే కాదు కొత్త విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్లు ఎక్కువ. దీంతో ఇవి ఆయా ప్రాంతాల్లో పని చేస్తున్న ఇంజినీర్ల పాలిట కామధేనువుల్లా మారుతున్నాయి.

## భార్యను చంపి.. వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి!

**- పిల్లల కళ్ల ముందే ఘాతుకం**
**- బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**



చనిపోయిన సరస్వతి, చిత్రంలో భర్త ఆంజనేయులు.

**జూబ్లీహిల్స్, జనవరి 20, ప్రభాతవార్తః** వారి కాపురంలో అనుమానం పెరిగి పెద్దదైంది.. కాపురం కలహాలమయమైంది.. అలిగి వెళ్లిన ఆలిని బాగా ఏలుకుంటానంటూ నమ్మించి ఇటీవలే తనతోపాటు ఇంటికి తీసుకొచ్చాడు.. అనుమానం పెనుభూతమై కన్నపిల్లల పక్కనుండగానే భర్త రోకలిబండతో భార్య తలను ఛిద్రం చేశాడు.. హత్య అనంతరం భార్యను చంపినట్లు వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకొని పరారయ్యాడు.. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న సంఘటన వివరాలు బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రాంతానికి చెందిన ఆంజనేయులు, వనపర్తికి చెందిన సరస్వతి(33) తమ 12, 9 ఏళ్ల ఇద్దరు పిల్లలతో కలిసి దాదాపు అయిదేళ్లకు పైగా బోరబండ సమీపంలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆంజనేయులు కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా సరస్వతి హైటెక్ సిటీ ప్రాంతంలోని ఒక కంపెనీలో హౌజ్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంది. భార్యపై అనుమానం పెంచుకున్న ఆంజనేయులు గత కొంత కాలంగా ఆమెతో గొడవలు పడుతున్నాడు. ఈ క్రమంలోనే ఇరవై రోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే పండుగకు ఊరికి వెళ్లిన ఆంజనేయులు భార్యను బాగా చూసుకుంటానని వారి కుటుంబ సభ్యులను నమ్మించి తనతోపాటు నగరానికి తీసుకొని వచ్చాడు. ఇంటికి వచ్చిన తరువాత అతని పద్దతి మారలేదు. భార్యతో తరుచూ గొడవపడుతున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న భార్యను రోకలిబండతో తలపై తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె తల చిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. పిల్లలు నిద్రలేవడంతో లైట్ తీసేసి వారిని పడుకోవాలని సూచించాడు. అనంతరం ఆంజనేయులు అక్కడి నుంచి జారుకున్నాడు. కాసేపటి తరువాత పిల్లలు నిద్రలేచి లైట్ వేసి చూడగా తల్లి రక్తపు మడుగులో పడి ఉండటంతో సమీపంలో నివసించే తమ మామకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. అతను నమ్మకపోవడంతో వీడియోకాల్ చేసి చూపారు. దీంతో ఆయన 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో బోరబండ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కన్నీరుమున్నీరవుతూ భయంలో ఉన్న పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరోవైపు భార్యను చంపిన ఆంజనేయులు 'నా జీవితంలో సగభాగమైన భార్యను నా చేతులరా నేను చంపుకున్నా' అంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఈ విషయాన్ని బంధువులు, స్నేహితులు గమనించారు. కాగా 2022లో భార్యతో గొడవ విషయంలో తమకు అడ్డుగా వచ్చాడని బామ్మర్ది ప్రశాంత్‌పై సైతం ఇలాగే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి సోదరుడు సుధాకర్ ఇచ్చిన పిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పిల్లలిద్దరికి ఫీజులు సైతం కట్టకపోవడంతో గత కొద్ది రోజులుగా పాఠశాలకు సైతం వెళ్లడం లేదని స్థానికులు తెలిపారు.

## ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



జిహెచ్ఎంసీ ఫీల్డ్ సిబ్బందికి టీ షర్ట్లు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో జిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త**

జిహెచ్ఎంసీ, నారెడ్కో ఆధ్వర్యంలో అంబర్పేట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జిహెచ్ఎంసీ ఫీల్డ్ సిబ్బందికి శీతాకాల టీ షర్ట్లు పంపిణీ చేశారు. మంగళవారం అంబర్పేట్ జిహెచ్ఎంసి గ్రౌండ్స్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు అంబర్పేట కార్పొరేటర్ విజయ్ కుమార్గౌడ్, నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత,బాగ్అంబర్పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, కాచిగూడ కార్పొరేటర్ కన్నా ఉమా రమేష్యాదవ్,జిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్, నారెడ్కో అధ్యక్షుడు విజయ్ సాయి మేఘ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న జిహెచ్ఎంసీ ఫీల్డ్ సిబ్బంది సేవలను కొనియాడారు.వారి సంక్షేమమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించిన కెసిఆర్ నాడు వారు అడక్కుండానే మూడుసార్లు జీతాలు పెంచారని గుర్తుచేశారు. వారిసేవలకు వెలకట్టలేమన్న ఆయన వారి కి ఎంత చేసినా తక్కువేనని అన్నారు. కార్యక్రమం జిహెచ్ఎంసీ సిబ్బందికి ఉత్సాహం, ప్రోత్సాహం నింపుతూ విజయవంతంగా సాగింది.

### ప్రమాదకర బ్లాక్ స్పాట్ను క్షేత్రస్థాయిలో సందర్శించిన అధికారులు

**మూసాపేట్, జనవరి 20, ప్రభాతవార్త**

ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రత-2026 కార్యక్రమాల్లో భాగంగా డీ-మార్ట్ సమీపంలోని నర్సాపూర్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రమాదకర బ్లాక్ స్పాట్ను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ ప్రాంతంలో ఉన్న యూటర్న్ను బారికేడ్లతో పూర్తిగా మూసివేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, కూకట్పల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) శ్రీను బాబు పాల్గొని, రోడ్డు పరిస్థితులు, వాహనాల రాకపోకలు, ప్రమాదాలకు దారితీస్తున్న అంశాలను సవివరంగా పరిశీలించారు. అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడం వల్లే ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణమే ఉపశమన చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు చదువు, క్రీడలలో రాణించాలి



విద్యార్థులకు క్రీడాజ్యోతిని అందజేసి ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ రామ్మోహన్

**చాంద్రాయణగుట్ట, జనవరి 20, ప్రభాతవార్త :** పాతబస్తీలోనీ దారుల్షిఫా ఫుట్బాల్ గ్రౌండ్లో సీఎం కప్ 2025 ర్యాలీని మంగళవారం బహదూర్పురా జోన్ (విద్యాశాఖ) డిప్యూటీ ఐఓఎస్ కె.రామ్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి విద్యార్థులకు క్రీడాజ్యోతిని అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఆటలు ఆడటం వల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఉత్తమ క్రీడాకారులుగా రానిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మెండుగా లభిస్తాయని తెలిపారు. ఈ ర్యాలీ దారుల్షిఫా నుండి సాలార్జంగ్ మ్యూజియం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో బహదూర్పురా మండలంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అంధుల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండడి వెంకట్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ముక్తదిర్, వ్యాయామ ఉపాధ్యాయులు జబీయుద్దీన్, అలందార్ రాజా, సాజిద్, నవనీత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బయో టెక్నాలజీ వర్క్ షాప్కు విశేష స్పందన



బయోటెక్నాలజీ వర్క్ షాప్ లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణ రెడ్డి.

**మెహిదీపట్నం, జనవరి 20, ప్రభాతవార్త :** మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన బయోటెక్నాలజీ వర్క్ షాప్ కు విశేష స్పందన లభించింది. జెనెటిక్స్ మరియు బయో మెడికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ అకాడమీల ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణ రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాధారిత విద్యను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలి అంటే అన్ని రంగాలు కలిసి పనిచేసే బహుశాక దృక్పథం అవసరమన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో జాతీయస్థాయి అకాడమిక్ అవుట్ రీచ్ కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నా రు. ఈ వర్క్ షాప్ లో వ్యవసాయం, జంతు శాస్త్రం, ఆరోగ్య రంగం వంటి విభిన్న విభాగాలలో బయోటెక్నాలజీ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు బి.జె.రావు, అప్పారావు పొడిలే, డాక్టర్ నాగేంద్ర, ఆర్.హెగ్డే, డాక్టర్ జి.గోపాల్, కె.మురళీధర్, వి.బి కవికిషోర్, డాక్టర్ వి.వేణుగోపాల్ రావులతో పాటు పరిశోధకులు అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరైనారు.

### ఎం.ఎస్.రెడ్డికి మదర్ థెరిస్సా సేవారత్న పురస్కారం

**హైదరాబాద్, జనవరి 20,ప్రభాతవార్త:** ప్రముఖ కంటి పరీక్షల నిపుణుడు, సామాజిక సేవాకార్యకర్త పి. మధుసూదన్ రెడ్డికి ప్రతిష్టాత్మక మదర్ థెరిస్సా సేవారత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు వైద్యుల, గ్లోబల్ ఫౌండేషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎల్బీనగర్ నియోజకవర్గం కర్మన్ఘాట్ రెవిన్యూ శ్రీరమణ కాలనీకి చెందిన మధుసూదన్ రెడ్డి మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు కంటి పరీక్షలు నిర్వహించడం, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేయడం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రులకు సిఫార్సు చేయడం వంటి సేవలతో పాటు ఇతర సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఈ నెల ఆఖరులో రవీంద్రభారతి వేదికగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ సేవా రత్నా పురస్కారాన్ని అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

## ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ నిధులు తెచ్చి సత్తా చూపించుకోవాలి : నర్మద



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ, బిజెపి నేతలు బి.ఎన్.శ్రీను తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 20 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్కు బోర్డు ప్రాంతాలపై ప్రేమ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకు రావాలని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ తెలిపారు. మంగళవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న శ్రీగణేష్కు బిజెపి రాజకీయ జీవం పోసిందన్నారు. కంటోన్మెంట్ ప్రజలపై ప్రేమ ఉన్నట్లుగా నటించడం మానేసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు వచ్చి తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు నిర్వహించాలని ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్రం ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్నారు. 10 నెలల తమ పది కాలంలో 15 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన టీపిటీ వంద కోట్ల బకాయిలు వెంటనే తీసుకు రావాలని డిమాండ్ చేశారు.

**నర్మధ అభినందనలు తెలిపిన బిజెపి శ్రేణులు ....**

కంటోన్మెంట్ బోర్డు మెంబర్గా బానుక నర్మధ పదవి కాలం మరో సంవత్సరం పాటు పొడగించినందుకు కంటోన్మెంట్కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు బి.ఎన్.శ్రీనివాస్, విజయానంద్, బానుక మల్లికార్జున్లు వందలాది మంది బిజెపి నాయకులు,మహిళా సంఘాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బానుక నర్మధకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఇన్స్పెక్టర్ హరికృష్ణారెడ్డి



అరైవ్-అలైవ్ కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పోలీసుల దృశ్యం.

**నార్సింగి, జనవరి 20 ప్రభాతవార్త :** వాహనదారులంతా స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్సింగి పోలీసు ఇన్స్పెక్టర్ హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 24.వ,తేదీ వరకు నార్సింగి ట్రాఫిక్ పోలీసులు వివిధ రంగాల ప్రజలకు ట్రాఫిక్పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదర్షాకోట్ డివిజన్ లోని ఎస్ఎంపి పాఠశాలలో విద్యార్థులకు "అరైవ్-అలైవ్" అనే కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ వేడుకలకు పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్రెడ్డి, నార్సింగి పోలీసు ఇన్స్పెక్టర్ హరికృష్ణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్.ఐ మల్లేష్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సంకేతాలు, సిగ్నల్స్, పాదచారుల భద్రత, హెల్మెట్ వాడకం వంటి అంశాలపై లఘు చిత్రాలను చూపించారు. ఈ అంశాలపైనే వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం ఇన్స్పెక్టర్లు హరికృష్ణారెడ్డి, కృష్ణలు మాట్లాడుతూ 18.ఏళ్లు పూర్తయిన వారే వాహనాలను నడుపాలని, మైనర్లు వాహనాలు నడుపకూడదన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్లు లేకుండా వాహనాలు తోలితే, సిగ్నల్స్ జంపింగ్, రాంగ్సైడ్ నడుపడం, అక్రమ పార్కింగ్ వంటివి చేస్తే పెద్ద ఎత్తున చలానాలు వేస్తామని, మైనర్ను, ఆయన తండ్రిని అవసరమైతే జైలుకు కూడా పంపుతామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నిబంధనలు మనందరి మేలు కోసమే ఉన్నాయని, అందరం విధిగా పాటిద్దామని సూచించారు.

## దేశ రక్షణలో ఎన్సిసి కేడెట్ల పాత్ర ఎంతో ఉంది : సిఈఓ ప్రొఫెసర్ లింబాద్రి



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, అంబేద్కర్ విద్యాసంస్థల సి ఈ ఓ ప్రొఫెసర్ లింబాద్రి

**చిక్కడపల్లి జనవరి 20,ప్రభాతవార్త :** దేశ రక్షణలో ఎన్ సి సి కేడెట్ల పాత్ర ఎంతో ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ చైర్మన్, అంబేద్కర్ విద్యాసంస్థల సి ఈ ఓ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఎన్ సి సి డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ లింబాద్రి తో పాటు డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డా. శేఖర్ మట్ట , ఎన్ సి సి అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడంలో ఎన్ సి సి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎన్ సి సి ద్వారా పొందిన శిక్షణను జీవితంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ ఎన్సీసీ విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజానికి సేవ చేసే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా. శేఖర్ మట్ట తన ప్రసంగంలో విద్యార్థులు చదువుతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమం చివరగా ఎన్సీసీ క్యాడెట్లకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అదనపు స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీవో 59 విడుదల చేయాలి



గాంధీ నగర్ జవహర్ నగర్ కమిటీ హాల్లో సమావేశమైన ఎస్ ఆర్ టి క్వార్టర్స్ ప్రతినిధులు మారిశెట్టి నర్సింగ్ రావు, నర్మెట్ట మల్లేష్, గుర్రం శంకర్ తదితరులు

**చిక్కడపల్లి జనవరి 20 ప్రభాతవార్త :** గత ప్రభుత్వం లో జీవో 59 ద్వారా స్థలాలను క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని,మరోసారి ఈ జీవోను విడుదల చేయాలని జవహర్ నగర్ ఎస్ ఆర్ టి క్వార్టర్స్ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. మంగళవారం గాంధీ నగర్ జవహర్ నగర్ కమిటీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక జవహర్ నగర్ ఎస్ ఆర్ టి క్వార్టర్స్ ప్రతినిధులు మారిశెట్టి నర్సింగ్ రావు, నర్మెట్ట మల్లేష్, గుర్రం శంకర్ లు మాట్లాడుతూ ఎస్ ఆర్ టి లో 411 క్వార్టర్స్ ఉన్నాయి..గత 70 సంవత్సరాల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నామని, గత ప్రభుత్వం స్థలాల క్రమబద్ధీకరణ చేసుకోవడానికి 59 జీవో తీసుకురావడం జరిగిందని తెలిపారు. కొంతమంది క్రమబద్ధీకరించుకోవడం వివరించారు. మరోసారి ఈ జీవోను విడుదల చేసి క్వాటర్స్ వాసులకు అదనపు స్థలాలకు (ఎక్సెస్ ల్యాండ్స్) క్రమబద్ధీకరించుకోవడానికి వెసులుబాటు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు..ఈ జీవో సాధన కోసం త్వరలోనే కమిటీ ఏర్పాటు చేయనట్లు తెలిపారు. అదేవిధంగా జవహర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి, డ్రైనేజీ, గుంతలమైన మయమైన రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో బిఆర్ఎస్ ,బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాకేష్ కుమార్, దేవయ్య,ఎస్ యాదగిరి,పున్న సత్యనారాయణ, మహేందర్, నాగేల్లి కృష్ణ.. సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### 22 నుంచి ఐమాక్స్ వద్ద గ్రాండ్నర్సరీ మేళా



గ్రాండ్ నర్సరీ మేళా అగ్రి, హార్టీకల్చర్ షో బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త**

నగరంలోని ఐమాక్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఐదు రోజుల పాటు నిర్వహించే 19వ గ్రాండ్నర్సరీ మేళా బ్రోచర్ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆవిష్కరించారు. కాంక్రీట్ జంగిల్గా మారుతున్న మహానగరాల్లో గ్రీనరీ అవసరమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నెల 22 నుంచి 26 వరకు ఆలిండియా హార్టీకల్చర్, అగ్రికల్చర్ ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నర్సరీ మేళా ఇంచార్జీ ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నర్సరీ ఉత్పత్తులతో ఆలిండియా హార్టీకల్చర్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెర్రస్ గార్డెనింగ్, వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్ వంటి కొత్త పద్ధతులను ఈ షోలో ప్రదర్శిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా కోల్కతా, ఢిల్లీ, హర్యానా, ముంబై, బెంగళూరు, ఏపీ, పుణె, షిర్డీ, కడియం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్లాంట్స్తో 120 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడిసినల్, కిచెన్, అవుట్ డోర్, బల్బ్స్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రీపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్ ప్రదర్శిస్తామని రాష్ట్ర మంత్రులు, హార్టీకల్చర్ ఉన్నతాధికారులు ఈ మేళా ప్రారంభిస్తారని ఖలీద్ అహ్మద్ వివరించారు.

### అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట - ఇన్స్పెక్టర్ సీతయ్య



సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఇన్స్పెక్టర్ సీతయ్య

**చాంద్రాయణగుట్ట, జనవరి 20, ప్రభాతవార్త :**

సైబర్ నేరగాళ్ళ ఉచ్చు నుండి తమను తాము రక్షించుకోవాలంటే అప్రమత్తతే ఒక్కటే మార్గమని ఫలక్నుమా ఇన్స్పెక్టర్ ఎ.సీతయ్య తెలిపారు. రోజుకో చిత్రవిచిత్రమైన మార్గంలో వల విసురుతున్నారని వివరించారు. మంగళవారం రవీంద్రనాయక్ నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థానికులకు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు, బ్యానర్ల ద్వారా విడమరిచారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అవగాహనతో ఉన్నప్పుడే సైబర్ నేరాలను కట్టడి చేయవచ్చొన్నారు. ప్రతి ఇంట్లో మొబైల్ వినియోగం, సామాజిక మాధ్యమాల వాడకం పెరిగిపోయిందన్నారు. వాటిలో వచ్చే అనవసరమైన లింకులు, మెసేజ్లు, ట్రేడింగ్, ఆధార్ అప్డేట్, ఏపీకె ఫైల్స్, ట్రాఫిక్ ఛాలాన్ల పేరుతో రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అనుమానిత లింకులు, సందేశాలను ఎట్టి పరిస్థితుల్లో తెరవద్దని సూచించారు. పోలీసుల డిజిటల్ అరెస్టులు ఉండవని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్సైలు, బస్తీవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైభవంగా సాగిన వాసవీ మాత ఆత్మార్పణ వేడుకలు



**నార్సింగి, జనవరి 20 ప్రభాతవార్త :** మణికొండ బీరప్ప దేవాలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం చేశారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెసనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ద శంకర్, జిల్లా అధ్యక్షురాలు స్రవంతిలు మాట్లాడుతూ వాసవీమాత ఆత్మార్పణం వృత్తాంతంను వివరించారు. వైశ్యులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. పేద వైశ్యుల ఇబ్బందులను దూరం చేసేందుకు, వారి బిడ్డల విద్యాభ్యాసాలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేణుమాధవ్, కార్యదర్శి భానుచందర్, కోశాధికారి యుగంధర్లతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిప్రపత్తులతో వాసవి కన్యాకా పరమేశ్వరిదేవి ఆత్మార్మణ దినోత్సవం



వాసవి కన్యాకా పరమేశ్వరిదేవి ఆత్మార్మణ దినోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 20, ప్రభాతవార్త :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు భక్తి ప్రపత్తులో జరుపుకున్నారు. లాల్దర్వాజా గౌలిపురాలోని కన్యకా పరమేశ్వర ట్రస్ట్ భవనంలో మంగళవారం అర్చక స్వాముల వేదమంత్రాల మధ్య అమ్మవారికి పంచామృత అభిషేకం, గాయత్రి యజ్ఞం, పుష్పార్చన, నైవేద్యం తదితర పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మహిళా సంఘం సభ్యులు మరియు కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ భవనం సంయుక్తంగా నిర్వహించినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ చీల రాములు గుప్త తెలిపారు. ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరయ్య గుప్తా, వైస్ చైర్మన్ గుగ్గిళ్ళ అశోక్ కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు కల్వాల సత్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సిరంగి సంపూర్ణ, వీరబొమ్మ చంద్రకళ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సరాబు సంతోష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి చాలికి నాగరాజు, గుగ్గిల సంతోష్ కుమార్, పెద్ది నాగేష్ గుప్తా, చాలికే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వాసవికన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మర్పాణ దినోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ మహిళలు

**చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో**

**కుత్బుల్లాపూర్, జనవరి 20 ప్రభాతవార్త :** ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవి ఆత్మార్పణా దినోత్సవం పూజలు ఘనంగా నిర్వహించారు. చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సంజీవయ్యనగర్లోని శ్రీ నల్లపోచమ్మ దేవి ఆలయ ప్రాంగాణంలో మహిళలు, పురుషులు పెద్దఎత్తున శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవి ప్రాశస్థత తను పొగుడుతూ పూజలు, పాటలతో అమ్మవారిని కొలిచారు. చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జూలూరు విజయ్కుమార్గుప్తా, మహంకాళీ ప్రభురాజ్గుప్తా, కోశాధికారి ఇల్లెందుల కృష్ణకుమార్గుప్తాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి జూలూరి పద్మ, కోశాధికారి రాజ్యలక్ష్మి, సభ్యులు సుమలత, శ్యామల, సంధ్య,శ్రావణి, సంగీత, లతోపాటు పెద్దఎత్తున మహిళలు అమ్మవారిని స్మరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి : డిసిపి రక్షిత కే మూర్తి



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కే మూర్తి

**ముషీరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త:** సైబర్నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కే మూర్తి సూచించారు. మంగళవారం దోమలగూడలోని ఏవీ కళాశాలలో సైబర్నేరాలు, మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా హాజరై డీసీపీ మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా, విద్యకు ప్రాధాన్యతనిస్తూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. యువత సైబర్నేరాలు, డ్రగ్స్, గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీటి బారిన పడి, అనేక మంది యువత బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో అధిక డబ్బులు సంపాదించాలనే అత్యాశకు పోవద్దని, బెట్టింగ్లు, ఆన్లైన్ యాప్లకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. యువత కష్టపడి, ఉన్నత స్థాయికి రావాలని, తద్వారా మన దేశానికి, రాష్ట్రానికి, వారి కుటుంబానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత మద్యం సేవించి, వాహనాలు నడిపి, వారు ప్రమాదాలకు గురవటమే కాకుండా, తోటి వాహనదారులకు సైతం ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎవరైపా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, దోమలగూడ సీఐ అంజద్అలీ, ఎస్ఐలు శ్రీనివాస్రెడ్డి, విజయ, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా శిక్షణా కార్యక్రమాలు

**సైఫాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** గ్రామీణ యువకులు ఉచితంగా స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సహికుల అభివృద్ధి సంస్థ తెలిపింది. మొబైల్ సర్వీసింగ్, రిఫ్రిజిటర్, ఎసి రిపేర్, ఎంఎస్ ఆఫీస్లలో శిక్షణా కార్యక్రమాలు రాజేంద్రనగర్లోని తమ కార్యాలయంలో శిక్షణ అందిస్తామని సంస్థ డైరెక్టర్ డి.నాగ రాజకుమార్ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ పాసైన, ఆపైన ఎక్కువగా చదువుకున్న అభ్యర్థులు ఈ కోర్సులలో శిక్షణ పొందడానికి అర్హులని, 38 రోజలపాటు ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో వసతి, భోజనం ఉచితం అందించబడునని అసక్తిగల యువకులు దరఖాస్తులను ఈ క్రింది వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఐఆర్ఇడి.ఒఆర్జిను చూడగలరని ఆయన కోరారు.

### ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



దివాకర్తో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

**హైదరాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** నల్లకుంట డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నెంబరు-13లో మంత్రశ్రీ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేయనున్న పార్కు ప్లానింగ్ పనులపై స్థానిక కార్పొరేటర్ అమృత జిహెచ్ఎంసి డిసి దివాకర్తో మంగళవారం చర్చించడం జరిగింది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ప్రవీణ్, ప్రవీణ్కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి మానవత్వాన్ని కాపాడుదాం అనే అంశంపై ప్రచార ఉద్యమం

**సైఫాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** నేటి యాంత్రిక జీవితంలో మానవుడు సాంకేతికంగా ఎదిగినప్పటికి నైతికంగా పతనం చెందుతున్నారని జమాయితే ఇస్లామీ హింద్ హైదరాబాద్ నగర అధ్యక్షుడు డాక్టర్ ముబషీర్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న విద్వేషం, అమానవీయ సంఘటనలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీ నుంచి 31 వరకు 'మానవత్వాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నామని ఆయన తెలిపారు. బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న, చిన్న కారణాలకే నిండు ప్రాణాలను బలితీసుకుంటున్న సంఘటనలు సమాజాన్ని కలిచివేస్తున్నాయని ఒక అమాయక ప్రాణాన్ని తీయడమంటే సమస్త మానవాళిని అంతం చేయడమేని చెప్పారు. క్షిణికా వేశంలో కత్తి పట్టడం పౌరుషం కాదని,ఆగ్రహాన్ని నిగ్రహించు కుని తొటి మనిషిని ప్రేమించడమే అసలైన ధైర్యమన్నారు. 10 రోజుల పాటు జరిగే ప్రచార ఉద్యమంలో నగర వ్యాప్తం గా అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ స్టేషన్లు నిర్వహిస్తామన్నారు.

### వైకల్యం, వృద్ధుల కోసం డిగ్నీమూవ్ సేవలు ప్రారంభం

**జూబ్లీహిల్స్, జనవరి 20, ప్రభాతవార్త:** శారీరక వైకల్యం, వృద్ధాప్యం, అనారోగ్యంతో గడప దాటని వారికి అండగా నిలిచేందుకు ఏసీటీఎస్ మొబిలిటీ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ డిగ్నీమూవ్ పేరుతో వినూత్న సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూబ్లీహిల్స్లోని హోటల్ దసపల్లాలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిగ్నీమూవ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రమణ ప్రసాద్ మాట్లాడుతూ.. గడప దాటి స్వేచ్ఛగా ప్రయాణించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని శక్తివంతం చేయడమే తమ లక్ష్యమన్నారు. వైద్య అవసరాలు, రోజువారి ప్రయాణాలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన ప్రయాణాన్ని అందించడమే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ సేవలను టెలిఫోన్, వెబ్సైట్, మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. వైద్యులు, ఫిజియోథెరపిస్టుల సాయంతో ఏర్పాటుచేశామని, శిక్షణ పొందిన డ్రైవర్లు, కేర్గివర్ల మద్దతుతో పరిమిత కదలిక ఉన్న వారు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు చక్కటి పరిష్కారం అందించనున్నామన్నారు. ఈ సేవలు వైద్య, వైద్యేతర ప్రయాణ అవసరాలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఇందు కోసం సొంతంగా వాహనాన్ని రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్క్లూజన్ కార్యకర్త సాయి ప్రసాద్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళితే.. ఇంట్లో చోరీ

**జూబ్లీహిల్స్, జనవరి 20, ప్రభాతవార్త:** సంక్రాంతికి సొంతూరికి వెళ్లిన ఒకరి ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలు చోరికి గురైన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్లోని అరోరా కాలనీలో నివసించే మౌనిక, మట్టా శ్రీశర్ దంపతులు సంక్రాంతి పండుగ నేపథ్యంలో పశ్చిమ గోదావరిలోని కోయలగూడెంకు వెళ్లారు. ఈ నెల 19న సమీపంలో నివసించే మౌనిక సోదరుడు విజయ్ ముకేష్ సోదరి ఇంటికి వెళ్లి చూడగా ప్రధాన ద్వారం తాళం పగిలి ఉండటంతో లోపలికి వెళ్లి గమనించగా ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడిపోయి కనిపించాయి. అలాగే పడకగదిలోని అల్మారా పగులగొట్టినట్లు గుర్తించారు. అల్మారాలో పెట్టిన 54 గ్రాముల బంగారూ ఆభరణాలతోపాటు వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో విజయ్ముఖేష్ బంజారాహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఆభరణాల విలువ రూ. 64వేలు ఉంటుందని పిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శిశు సంరక్షణ పేరుతో మోసం... నిర్వాహకురాలిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జనవరి 20, ప్రభాతవార్త:**

శిశు సంరక్షణ కోసం ఇన్స్టాగ్రామ్ ద్వారా ఒక సంస్థను ఆశ్రయించగా మోసానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ప్రియాంక గుప్తా శిశు సంరక్షణ సేవల కోసం ఇన్స్టాలో గమనిస్తుండగా అందులో టెండర్కేర్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక సంస్థ సేవలందిస్తున్నట్లు గుర్తించింది. దీంతో వారిని సంప్రదించగా డబ్బులు చెల్లిస్తే తాము సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంస్థ నిర్వాహకురాలు కీర్తిరెడ్డి జంగంగారి తెలిపారు. ఆమె మాటలు నమ్మి ప్రియాంక గుప్తా వారి ఖాతాకు రూ. 34,999 బదిలీ చేసింది. అయితే ఎలాంటి సంరక్షురాలిని కేటాయించకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ కోరింది. తనకు డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఎన్సీఆర్పీ పోర్టల్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

**కొంపల్లి, జనవరి 20, ప్రభాతవార్త :** ఓ వ్యక్తి అదృశ్యం అయిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లి, శ్రీ సాయి నగర్కు చెందిన సలీముద్దీన్ (35) మంగళవారం సాగర్ గుట్కా కొనడానికి వెళ్తున్నాను అని చెప్పి ఇంటి నుండి వెళ్లి, ఇప్పటివరకు తిరిగి రాలేదు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉందని, గతంలో కూడ ఇంటి నుండి వెళ్లి కొన్ని రోజులకు తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. బంధువులు, స్నేహితులను విచారించిన, తెలిసిన ప్రదేశాలలో వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. ఈ వ్యక్తి గురించి ఎవరికైనా ఏమైనా సమాచారం తెలిసినట్లయితే, బాచుపల్లి పోలీస్ స్టేషన్కు గాని లేదా ఈ నెంబర్లకు దర్యాప్తు అధికారి 8712567898, 9908502370లకు గాని తెలియజేయాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**పేట్ బషీరాబాద్, జనవరి 20, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామాయంపల్లి గ్రామం, పుట్టపాక మండలం, కరీంనగర్కు చెందిన చందర్ రెడ్డి, మైసమ్మగూడ సత్రజపల్లె, వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎక్కినపల్లి సుజిత్ (22)లు మంగళవారం తన ఫ్రెండ్ని కలవడానికి బైక్ నెంబర్ టిఎస్ 07ఎఫ్కె 5118 పై వెళ్తున్నారు. మైసమ్మగూడ నుండి అపిల్ పార్క్ వెళ్లే రోడ్డుపై బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టడంతో వెనక కూర్చున్న సుజిత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హాస్పిటల్ తీసుకెళ్లే లోపు మృతి చెందాడు. బైక్ నడుపుతున్నటువంటి చందర్ రెడ్డి కాలికి గాయం అయింది. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్,అధికారులు


అధికారులతో కలసి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువు బండ్ అభివృద్ధి పనులు, గ్రీన్ పార్క్ కాలనీలో చేపడుతున్న పనులను లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మంగళ వారం జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిసి మల్లికా ర్జున్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నెం. 17లో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను చెరువులో నీటి మట్టాన్ని పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని అధికారులకు జడ్‌సి సూచించారు. గ్రీన్ పార్క్ కాలనీ ప్రధాన రహదారి నూత నంగా నిర్మాణం చేపడుతామని, చెరువు బ్యూటిఫికేషన్ పనుల తో పాటు నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభ మవుతాయని జడ్‌సి తెలిపారు. మెగా ఫంక్షన్ హాల్ ముందు నాలా మళ్లింపుకు సంబంధించిన పనులు టెండర్ దశలో ఉన్నా యని అధికారులు పేర్కొన్నారు. రోడ్డు నెం.3, 8లలో సిసి రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే మొదలవుతాయని కార్పొరేటర్ రాజశే ఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఎన్‌డిపి నాలాలో అడ్డుగా ఉన్న త్రాగునీటి పైపులైన్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని గ్రీన్ పార్క్ కాలనీ అసోసియేషన్ నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ కార్తీక్, ఎసిపి ప్రతాప్, డిఇ రవిచంద్ర, ఎఇ సురేష్ కుమార్, కాలనీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి, దేవాలయ కమిటి ఛైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్తీలలో పర్యటించిన మడిగల విజయ భాస్కర్‌రెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న మడిగల విజయ భాస్కర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 20 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ భూ లక్ష్మినగర్, హరిజనబస్తీ, హమాలిబస్తీ, గాంధీనగర్‌లలో ఇంటర్నే షనల్ హ్యూమన్ రైట్స్ కమిటి ఆఫ్ ఇండియా తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగల విజయ భాస్కర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు, హైటెన్షన్ వైర్ల వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థంబాలకు ఏర్పాటు చేసిన మీటర్లు పనిచేయడం లేదని, వాటి వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్థానికం గా ఉన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



**నేరేడ్‌మెట్, జనవరి 20,ప్రభాతవార్త :** వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటే శ్వరస్వామి దేవాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వ హించగా ఆలయ ప్రాంగణం భక్తి మయంగా మారింది.ఉదయం స్వామి-అమ్మవార్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, అనంతరం హోమం, సామూహిక లలిత సహస్ర నామ పారాయణతో కుంకుమ అర్చన చేపట్టారు. వేదపండితులు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ ఘట్టం, తిరుకల్యాణ మహాత్మ్యాన్ని భక్తులకు వివరించి, ధర్మ మార్గంలో జీవించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.తిరుకల్యాణ కార్యక్రమా న్ని సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించగా భక్తులు అక్షింతలు వేసి మంగళహారతులతో స్వామి-అమ్మవార్లకు నివేదనలు సమ ర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాత లు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టగా 300 మందికి పైగా భక్తులు పాల్గొని స్వామి-అమ్మవార్ల అనుగ్రహాన్ని పొందారు.

## బండాచెరువు వాకర్స్ పార్క్ అభివృద్ధి పనులకు శ్రీకారం



**నేరేడ్ మెట్, జనవరి 20,ప్రభాతవార్త :** బండచెరువు వాకర్స్ పార్కులో రూ.16 లక్షల వ్యయంతో నిర్మిం చనున్న ర్యాంప్, మెట్లు, పార్కింగ్ స్థలం, ఆర్చ్‌తో పాటు ఇతర అభివృద్ధి పనులను వినాయక్‌నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్య లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. పార్క్‌ను ప్రజలకు మరిం త సౌకర్యవంతంగా, భద్రంగా మారుస్తామనే లక్ష్యంతో ఈ పను లు చేపట్టినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ వాసుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లాల్వాని నగర్ కాలనీ అధ్యక్షుడు నరేష్, అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్, గోపాల్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ గౌలికర్, ఓం ప్రకాష్, సంతోష్, బీజేపీ నాయకులు జగదీష్ చారి, సాయి సురేష్, గోపాల్, ఉమాకాంత్, ఇంజినీరింగ్ విభా గం ఏఈ నవీన్ కుమార్, సూపర్‌వైజర్లు సాగర్, వెంకటేష్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించండి : ఏఈ రామకృష్ణ

**కుషాయిగూడ జనవరి20, ప్రభాతవార్త :** మరమ్మత్తుల కారణం గా విద్యుత్ సరఫరా లో 21 బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. 11 కెవి సాకేత్ ప్రణామం విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాకేత్ ఫేస్ 1, సాకేత్ ఫేస్ 2, ఊర్ల ఫంక్షన్ హాల్, శ్రీ యుగ ఎంక్లేవ్ ,ప్రనామ్ అపార్ట్మెంట్ ఏ,బీ,సీ బ్లాకులు, ధనలక్ష్మి సూపర్ మార్కెట్ ,సాకేత్ స్వర్ణ ప్రాంతాలలో 11 కెవి సాయిరాం నగర్ సాకేత్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంట ల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాయిబాబా నగర్, ఇందిరానగర్, సాయి నగర్ ,శ్రీ కాలనీ, గవర్నమెంట్ డబల్ బెడ్ రూమ్ ప్రాంతాలలో, మధ్యాహ్నం రెండు గంటల నుండి సా యంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ తెలిపారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## సైబర్ క్రైమ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి : ఏసిపి సుబ్బరామిరెడ్డి


సమావేశంలో ప్రసంగిస్తున్న ఏసిపి సుబ్బరామిరెడ్డి, చిత్రంలో ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, జనవరి 20, ప్రభాతవార్త:** సైబర్ క్రైమ్స్ పై అవగాహన పెంపొందించుకోవాలని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో మలక్ పేటలోని దిల్ ఖుశ ఫంక్షన్ హాల్ లో సైబర్ క్రైమ్స్ గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తమ బ్యాం కు వివరాలు ఏటీఎం, ఓటీపి వివరాలు, ఆధార్ కార్డు వివరాలు ఎవరికీ చెప్పకూడదని, సైబర్ క్రైమ్స్ మోసాల గురించి తెలిపారు. ఆన్లైన్ మోసాలు, ఫేక్ కాల్స్ ,ఓటిపి, యూపీఐ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్, సోషల్ మీడి యా హాకింగ్, అనుమానాస్పద లింకుల గురించి వివరించా రు. సైబర్ క్రైమ్ మోసాల గురైతే వెంటనే 1930 లో తెలి యజేయాలని పేర్కొన్నారు. సైబర్ మిత్ర యాప్ ఉపయో గించే విధానం గురించి అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా ఉండడానికి పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, ఆన్లైన్ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సైలు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం


వాసవి మాతకు అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు: చిత్రంలో నాళ్ల శ్రీనివాస్‌గుప్త, పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, ఇరువెంటి సురేష్‌గుప్త తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డులోని మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన నిర్మాణంలోనున్న దేవాలయంలో ఆర్యవైశ్యుల ఆరా ధ్యదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ తేరేటిపల్లి శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో వాసవి మాత అమ్మవారికి ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా వేద మంత్రో చ్చారణలతో మహా చండీహోమం జరిపారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేసి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం అన్నప్రసాద వితర ణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా అ ధ్యక్షుడు గందె సురేష్‌గుప్త, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు బాలాపూర్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నాళ్ల శ్రీనివాస్‌గుప్త, వాసవి మాత దేవస్థానం అధ్యక్షుడు పచ్చిపులుసు శ్రీరామచంద్ర మూర్తి గుప్త, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్‌గుప్త, కోశాధికారి గందె వెంకటేశ్వర్లు గుప్త, మేనేజింగ్ ట్రస్ట్ సభ్యు లు, ఆలయ డైరెక్టర్లు, ఆలయ నిర్మాణ దాతలు, పెద్ద సం ఖ్యలో మహిళలు, ఆర్యవైశ్య కుటుంబాల వారు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో అభివృద్ధి పనులు : రజిత పరమేశ్వర్‌రెడ్డి


ఉప్పల్ భగాయత్‌లో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకుంటు న్నామని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎండిఏ, జలమండలి, జీహెచ్‌ఎంసి తదితర విభాగాల అధికారులతో కలిసి పర్య టించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భగాయత్ సమస్యలపై హెచ్‌ఎండిఏ కమిష నర్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. రూ.10 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.3 కోట్లతో కమ్యూనిటి హాల్, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారని తెలి పారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. స్థానిక సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మతులు, తదితర అంశాలను గురించి అధికారులకు విన్నవించామని తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సకాలం లోనే అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. త్వర లో రహదారుల మరమ్మతు పనులను చేయిస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ డిఇ సత్యప్రసాద్, ఎఇ వెంకటేష్, జీహెచ్‌ఎంసి డిఇ వెన్నెల గౌడ్, ఎఇ రాజ్ కుమార్, ఎలక్ట్రికల్ డిఇ అనిత, శానిటేషన్ ఎఇ పుష్పలత, బాగాయత్ కాలనీ సభ్యులు శ్రీనివాస్‌రావు, సుధాకర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంచందర్ రెడ్డి, వంశీదర్ రెడ్డి, సూర్య గోపాల్, శ్రీపతి రావు, ఈగ సంతోష్, నిదానకవి సుధాకర్, పూజల ప్రభాకర్, సోమ్ జంగయ్య, ప్రభాకర్ రెడ్డి, విప్లవ్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, సచిత్, రవీందర్ రావు, చారి, విజయ్, చంద్రశేఖర్ రెడ్డి,సంగమేశ్వర్ రెడ్డి, రంగ నాథ్, తదితరులు పాల్గొన్నారు

## ధర్మ రక్షణ సభకు మార్వాడీ సమాజ్ సంఘీభావం


ఛలో బాలాపూర్ ధర్మ రక్షణ సభ వాల్ పోస్టర్లు, కరపత్రాలను మార్వాడీ సమాజ్ ప్రముఖులతో కలిసి ఆవిష్కరిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** బాలాపూర్ పరిసరా ల్లో అక్రమంగా నివసిస్తూ ప్రమాదకరంగా మారిన బర్మా (మయన్మార్) దేశానికి చెందిన రోహింగ్యాలను వెనక్కి పంపాలనే డిమాండ్‌తో ఈ నెల 24న బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో గణేష్ సేన ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ధర్మ రక్షణ సభకు బడంగ్‌పేట్ సర్కిల్ మార్వాడీ సమాజ్ సంపూర్ణ మద్దతు తెలిపింది. సభ విజయవంతం కోసం విస్తృతంగా పర్యటిస్తు న్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, బిజెపి కాంటె స్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ నాదర్‌గుల్ డివిజన్ కిందకు వచ్చే అల్మాస్‌గూడలోని ఆయీ మాత ఆలయంలో మార్వాడీ సమాజ్‌కు చెందిన ప్రముఖులు, వారి కుటుంబాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో కలిసి సభ కరపత్రాలను ఆవిష్కరించి సభ ఉద్దేశ్యాలను వివరించారు. అనంతరం మార్వాడీ సమాజ్‌కు చెందిన ముఖ్యులు మాట్లాడుతూ జాగో భాగ్యనగర్.. ఛలో బాలాపూర్ నినాదంతో ధర్మ రక్షణ పేరిట నిర్వహిస్తున్న సభలో భాగస్వాములై విజయవంతం కావడానికి సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ సభలో పెద్ద ఎత్తున మార్వాడీ కుటుంబాలు పాల్గొంటాయని వారు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు, సీనియర్ బిజెపి నాయకుడు రామిడి శూరకర్ణారెడ్డి, బడంగ్‌పేట్-1 బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృ ష్ణారెడ్డి, సీర్వీ సమాజ్ ముఖ్యులు, మార్వాడీ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## పగిలిన పైప్ లైన్ ...కార్పొరేటర్ ఆగ్రహం


కాలనీ వాసులతో మాట్లాడుతున్న పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో అధికారులు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం విడనాడాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్ సూచించారు. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో కొనసాగుతున్న స్టార్మ్ వాటర్ పైప్‌లైన్ పనుల సమయంలో 250 ఎంఎం డయా వాటర్ పైప్‌లైన్ దెబ్బతిని భారీగా నీటి ప్రవాహం వెలువడింది. దీంతో కాలనీ ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.సమాచారం తెలిసిన కార్పొరేటర్ ఘటన స్థలానికి చేరుకొని నిర్లక్ష్యంగా పనిచేసిన కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్, జలమండలి డీజీ ఎం రవీందర్ వర్మ, మేనేజర్ స్రవంతి సం ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. నీటి సరఫ రా పునరుద్ధరించి, ప్రజల ఇబ్బందులు త్వరగా తొలగేలా స మన్వయంతో పనిచేసి సమ స్యను పరిష్కరించాలని కార్పొరే టర్ వారికి సూచించారు.

## ఎంపి ఈటల రాజేందర్‌తో అఖిలపక్ష నేతల బేటి


ఎంపి ఈటలకు వినతి పత్రం ఇస్తున్న ఉప్పల్ డివిజన్ అఖిలపక్ష కమిటి నేతలు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ విభజన విష యంలో అధికారుల తీరుపై తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ ఉప్పల్ డివిజన్ అఖిల పక్ష కమిటి ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్, శామీర్‌పేట ధర్మారెడ్డి, బిఆర్‌ఎస్ సీనియర్ నేత లు అరటికాయల భాస్కర్, పి.జితేందర్‌రెడ్డి, మేకల మధు సూధన్‌రెడ్డి, అన్య బాలకృష్ణ, లేతాకుల రఘుపతిరెడ్డి, దాసరి వీరేష్, టిడిపి నేత పబ్బతి శేఖర్‌రెడ్డి, బజారు హే మంత్‌గౌడ్ తదితరులు పాల్గొని ఎంపి ఈటల రాజేందర్‌కు పలు సమస్యలు విన్నవించారు. డివిజన్‌లో సుమారు 80వే ల మంది ఓటర్లను ఏర్పాటు చేశారని, డివిజన్ విభజన సరిగ్గా చేయలేదని పేర్కొన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన


రామంతాపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు, ఏసిపి చక్రపాణి తదితరులు

**రామంతాపూర్ జనవరి 20 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతా మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉప్పల్ పోలీస్‌స్టే షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉప్పల్, చిలుకానగర్, వెంకటరె డ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఉప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులు, స్థానికులకు అవగాహన సదస్సులు నిర్వ హించారు. అడిషనల్ డిసిపి శ్రీనివాస్ కుమార్, ఉప్పల్ ఏసిపి ఎ.చక్రపాణి, సిఐ భాస్కర్, ట్రాఫిక్ సిఐ నాగరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలి పారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు : శ్రీకాంత్ యాదవ్

**రామంతాపూర్, జనవరి 20 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్ల పు శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళ వారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో పలువురు కాలనీ సంఘం నేతలతో కలిసి పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. బస్తీలలో పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా పూర్తి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి సహకారంతో రామంతాపూర్‌కు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు కేశవ రెడ్డి, విష్ణు మూర్తి, ఆటో కుమార్, స్వామి, చంద్రం, సంజీవ, కాంగ్రెస్ పార్టీ నేతలు జలీల్ పాషా, శామ్యూల్, జంగయ్య, రాజి రెడ్డి, బాబురావు, సురేష్, పెంటయ్య, జంగా రెడ్డి, సందీప్, జి స్వామి, శ్రీధర్, అరుణ్ సాయి, బుల్లెట్ అశోక్, శంకర్, కిరణ్, గౌతమ్, రావ కృష్ణ, విజ్జు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్‌మెట్-యాప్రాల్ సమస్యల పరిష్కారానికి చర్యలు
### -జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్



**నేరేడ్ మెట్, జనవరి 20,ప్రభాతవార్త :** నేరేడ్‌మెట్, యాప్రాల్ పరిధిలోని ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మల్కా జిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. నేరేడ్ మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రతిపాదనలు, నేరేడ్‌మెట్ చౌరస్తా ఫు ట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ మెయింటెనెన్స్, యాప్రాల్ రామ హౌ సింగ్ సొసైటీ రోడ్డు సమస్యలపై వినతి పత్రాలు అందజే శారు.ఈ అంశాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమం లోసీనియర్ నాయకులు,డివిజన్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలి


వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్ యాదవ్

**హయత్ నగర్, జనవరి 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సొంత భవనం లోకి మార్చాలని కోరుతూ అడ్వకేట్, బీజేపీ నాయకులు పిల్లి శ్రీనివాస్ యాదవ్ మంగళవారం పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రైవేటు భవనంలో ఉండటం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతోందన్నారు. పెద్ద అంబర్‌పేట్ చౌరస్తాలోని ప్రభుత్వ స్థలంతో పాటు, వినియోగంలో లేని ఖాళీ భవనం అందుబా టులో ఉందన్నారు. ఆ భవనంలోకి కార్యాలయాన్ని తరలిస్తే అద్దె ఆదా అవుతుందన్నారు. ప్రధాన రహదారికి సమీపంలో ఉండటం వల్ల ప్రజలకు, రైతాంగానికి రవాణా పరంగా ఎం తో సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఈ అంశంపై తదుపరి చర్యల కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ కి పోస్టల్ ద్వారా లేఖ పంపినట్లు వివరించారు. అధికారులు దీనిపై సానుకూలంగా స్పందించి కార్యాలయ తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

## ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** శ్రీఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో న్యూ నాగోల్, కొత్తపేటలో జరిగిన ఆర్యవైశ్య వాసవి మాత ఆత్మా ర్పణ దినోత్సవం కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యద ర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా అమ్మవారికి పంచామృ తంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల తో కలిసి ఆశీర్వచనాలు అందుకున్నమన్నారు. వాసవి మాత ఆశీస్సులతో సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొం దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గర పూదయానంద్ గుప్త, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, యర్రమల్ల శ్రవణ్ కుమార్, తెలుకుంట్ల సుధాకర్,మంచు కొండ సురేందర్, బి. రమేష్, బలుసాని కు మార స్వామి, అధ్యక్షులు గుండా రామకోటేశ్వర రావు, పబ్బ కృష్ణమూర్తి, మోట్కూరి రమేష్, కొండూరు వెంకటరమణ, మారం నగేష్, వీసంశెట్టి మురళీశేఖర్, గుండా చంద్రశేఖర్, పోలా వంశీ కృష్ణ, నల్లపాటి కళ్యాణ్ గుప్త, మహంకాళి మల్లిఖార్జన గుప్త, కారంశెట్టి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం


ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించే దక్కన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామ్ దర్బార్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం దాదాపు 500 మందికి సాధారణ వైద్య పరీ క్షలతో పాటు దంత, కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ మేరకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లా డుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా దక్కన్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ విరివిగా ఫ్రీ హెల్త్ క్యాంపులను నిర్వ హిస్తుందని వెల్లడించారు. స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో సేవలు అందిస్తున్న వైద్య బృందానికి, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.


బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని హరిహారపురం కాలనీలో గల శ్రీ త్రిశక్తి ఆలయ 12 వ వార్షికోత్సవ వేడుకలలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. (ప్రభాతవార్త వనస్థలిపురం)

## గ్రేటర్‌పై మళ్లీ గులాబీ జెండా ఎగరవేయాలి :కెటిఆర్


కేటీఆర్‌తో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** రాబోయే జీహెచ్‌ఎంసి ఎన్నికల్లో మరొకసారి మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేసి ఎన్నికల సెమీఫైనల్స్ శంఖారావం పూరిద్దామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇం ద్రారెడ్డితో కలిసి మహేశ్వరం నియోజకవర్గ బిఆర్‌ఎస్ ప్రధా నకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ మంగళవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గద్దెనె క్కిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యా రని అన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ను అడుగుతే అక్రమ కేసులు బనయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధి జీహెచ్ ఎంసి డివిజన్‌లలో గులాబీ జెండా ఎగరేయాలన్నారు. ఇప్ప టి నుండే కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారని అరవింద శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 20 ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసి బడం గ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బడంగ్‌పేట్ డివిజన్‌లో మంగళ వారం బడంగ్‌పేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్ మాజీ మేయర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు తోన్పునూరి శ్రీనివాస్‌గుప్త, దాచే పల్లి వెంకటేశ్వర్లు, వీరమల్లి రామమూర్తి, సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళలతో పాటు బడంగ్‌పేట్ కాంగ్రెస్ నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

**హయత్ నగర్, జనవరి 20 ప్రభాతవార్త :** డివిజన్‌లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీకుంటు న్నామని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం దత్తాత్రేయ కాలనీలో పర్యటించిన ఆయన కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకు న్నారు. కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ కొర త ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ కు వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ గారు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా దత్తాత్రేయ కాలనీలో అభివృద్ధి పను లను దాదాపు పూర్తి చేసామని, మిగిలి ఉన్న కొద్దిపాటి భూ గర్భ డ్రైనేజ్ పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దత్తాత్రేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి


ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వార్డు కార్యాలయంలో ఉప్పల్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజ న్‌లో ఐదు కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.4 కోట్ల 67 లక్షలు మంజూరు అయినట్లు తెలిపా రు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిం చాలని సూచించారు. పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ పనులకు టెండర్లు పిలిచి వెంటనే చేపట్టాలని కోరారు. అవసరమైన చోట్ల రో డ్లు, డ్రైనేజీ, మంచినీటి పనుల కోసం అంచనాలు రూపొం దించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెల్ గౌడ్,ఎఇ రాజ్‌కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ కేదార్ పాల్గొన్నారు.

## హరీష్‌రావు నివాసానికి తరలిన బిఆర్‌ఎస్ నేతలు


మాజీ మంత్రి హరీష్‌రావుకు మద్దతుగా తరలివెళ్లిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 20 ప్రభాతవార్త :** మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు మంగళవారం ఉదయం ఆయన నివాసానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా హరీష్‌రావును కలిసి తమ మద్దతు ప్రకటిం చారు. ఎన్నికల ముందు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నార ని, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, హరీష్‌రావును వేధించడం సబబు కాదన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రాబో యే రోజుల్లో బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బిఆర్‌ఎస్ నేతలు జూబ్లీ హిల్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.